

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 14 | సంచిక : 10 | జూన్ 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 25-03-2009

భీమవరం ....... 09-04-2009

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747




## *Most beloved Sri Nannagaru*

*May Ramnath ask for thy Blessings!*

*May (I) always have your blessings*

*And protection from the crocodiles*

*In the ocean of Samsara*

*With your blessings and guidance*

*That I may cross this ocean safely*

*To the other shore.*

*Do not ever ever let me forget you.*

*May I always have your love*

*In my Heart.*

*With all love and gratitude*

*your Ramnath*

***NAMO BHAGWATE SRI ARUNACHALA SHIVA***

# (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-03-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ఏకారణం వలన అయినా భయం వేస్తూ ఉంటే ఆ భయం ఉన్నంతకాలం టైము వేస్టయిపోతుంది. మనం ఎవరినైనా చూసి అసూయపడుతున్నాము అనుకోండి, అసూయ ఉన్నంతకాలం కాలం వృధా అయిపోతుంది. భగవంతుడిని స్మరించుకోవాలి అనుకొంటున్నాము కాని మనస్సు అటు వెళ్ళటంలేదు అని కొంతమంది అంటూ ఉంటారు. అది నిజమే ఎందుచేతనంటే మనకు కోపం ఎక్కువగా ఉంది అనుకోండి, ఎవరిమీద అయినా అసూయ ఉంది అనుకోండి, మనకు భయం వేస్తుంది అనుకోండి ఇంక మనస్సు వీటి చుట్టూ తిరుగుతుంది కాని భగవంతుడివైపుకు వెళ్ళదు. అలా మన మనస్సు వాటి చుట్టూ తిరుగుతున్నంతకాలం టైము అంతా వేస్టు అయిపోతుంది. బుద్ధుడి మొఖంలో ఎప్పుడూ కోపం కనబడదు. ఆయనకు విసుగు కలిగించే మాటలు, భక్తిలేని మాటలు మనం మాట్లాడితే ఆయన మౌనంగా ఉంటాడు అంతేగాని మనకు సమాధానం చెప్పడు. అవసరంలేదు అనుకొంటే ఒక్క మాట కూడా మాట్లాడడు. రమణమహర్షిగారు, రామకృష్ణపరమహంస గారు కొద్దిగా కోపం నటించేవారు. మన అవతారపురుషులలో నటనకోసం కూడా కోపం లేనివాడు బుద్ధుడు. రమణమహర్షిగారికి కోపం వచ్చింది అనుకోండి, అది నీటిమీద గీత వంటిది. వారికి కోపం రావటానికి అది వారికి ఒక వికారం కాదు, మనకోసం నటిస్తారు అంతే. బుద్ధుడు అయితే మన కోసం కూడా కోపం తెచ్చుకోడు. బుద్ధుడు ప్రతీ విషయాన్ని హేతుబద్ధంగా మాట్లాడతాడు. వాడు నా స్నేహితుడు, వీడు నా విరోధి అని అనుకొంటాము. వీటివలన టైము వేస్టు. వాడు నా స్నేహితుడు అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సే చెపుతోంది. వీడు నా విరోధి అని ఎవరు చెపుతున్నారు, అదీ నీ మనస్సే చెపుతోంది. ఈ గొడవలు అన్నీ నీ మనస్సు కల్పితములేగాని అందులో ఏమీ లేదు. ఇలా మనస్సు కల్పించిన గొడవల చుట్టూ తిరుగుతూ ఒకరోజు, రెండు రోజులు కాదు వేలాదిజన్మలు పాడుచేసుకొంటున్నాము, ఇది మనకు తెలియటం లేదు.

మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను, మీ కోసమే బతుకుతున్నాను అంటాడు. అది నిజంకాదు, మాయ. అంతా ఈ చిన్న వాక్యంలో ఉంది. ఇద్దరు ఉంటే ఒకరిని ఒకరు ప్రేమించుకోవటం, ఉన్నది ఒక్కటే అయినప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు. వారికి నేను చాలా ఉపకారం

చేసాను, వారికి ఏమీ కృతజ్ఞత లేదు అంటాడు. ఇవి ఏమీ నిజం కాదు. మీకు నిజంగా ఎవరి మీద అయినా ప్రేమ ఉంటే నాకు ప్రేమ ఉందని నోటితో చెప్పరు, యాక్షన్‌లో చూపిస్తారు అంతే. చేత్తోటి చేసేటప్పుడు నోటితో చెప్పటం ఎందుకు. మన మనస్సుకు బాగా సన్నిహితంగా ఉన్న వారికి ఎక్కువ గౌరవం చెయ్యము. సన్నిహితం కాని వారికే ఎక్కువ గౌరవం చేస్తాము, అలా చేయటానికి కారణం ఏమిటి అంటే వారు ఏమీ అనుకోకుండా ఉండాలి అనుకొంటాము, దీని వలన మనస్సు పెరిగిపోతుంది, మనం ఊరికే గుడ్డితనంగా ఉంటే సబ్జక్టు తెలియదు, మనస్సులో విశ్లేషణ ఉండాలి. మనకు గుణాలు ఉన్నాయి, గుణాలను బట్టి పనిచేస్తాము. ఆ గుణాలు చేస్తున్నాయన్న సంగతి తెలియక నేను చేసాను అంటాడు. సత్వగుణం ఉన్నవాడు ఒక రకంగా పనిచేస్తాడు, రజోగుణం ఉన్నవాడు ఇంకో రకంగా పనిచేస్తాడు, తమోగుణం ఉన్నవాడు వేరొకరకంగా పనిచేస్తాడు. ఈ గుణాలను తీసేస్తే లోపల చేసేవాడు కనబడడు, వాడు బ్రహ్మమైపోతాడు. ఈ గుణాలు ఉన్నవాడు జీవుడు, ఈ మూడు గుణాలను దాటినవాడు దేవుడితో సమానము, వాడికి నమస్కరిస్తే అది భగవంతుడికే అందుతుంది. వాడి ద్వారా భగవంతుడు మనలను ఆశీర్వదిస్తాడు.

కాలువలో ఉన్న నీరు వచ్చి మన చేనులో పడిపోదు, ఆ నీరు ఏదో బోది ద్వారా, తూము ద్వారా వచ్చి మన చేనులో పడుతుంది. అలాగే ఈశ్వరుని యొక్క కృప గురువు ద్వారా మనకు అందుతుంది. మనకు ఒక కోరిక నెరవేరింది అంటే అది వంద కోరికలను తీసుకొని వస్తుంది. వంద కోరికలు వచ్చినా పరవాలేదు, వెంటనే గర్వం వచ్చేస్తుంది. ఈ కోరికల వలన వచ్చే ఫలితం భౌతికమైనదికాని గర్వం మరణానంతరం మన కూడా వచ్చేస్తుంది, అది అనేక నీచ జన్మలకు కారణం అవుతుంది. ఇప్పడు మనం ప్రపంచంతోటి ఎక్కువగా కలిసి ఉంటున్నాము. మనం ప్రపంచంతోటి ఇష్టంగా ఉండే కొలది భవంతుడికి దూరమైపోతాము. మనం ప్రపంచానికి చెందిన మనుషులమే అయితే దానిని నెత్తిన వేసుకొని తిరిగినా ఫరవాలేదు కాని మనం ప్రపంచానికి చెందిన మనుషులం కాదు, మనం భగవంతుడికి సంబంధించిన మనుషులము. అందుచేత మనం ప్రపంచంతోటి, సమాజంతోటి అతిగా ఉండకూడదు. మనం రోజూ కంచంలో అన్నం తింటాము, అన్నం తిన్న తరువాత దానిని కడిగేసి ఒక ప్రక్కన పెట్టేస్తాము కాని దానిని నెత్తిమీద పెట్టుకొని తిరగము. మనం కంచాన్ని ఎలాగ ఉపయోగించుకొంటున్నామో అలాగే ప్రపంచాన్ని ఉపయోగించుకోవాలి, మనకు ఎంత వరకు అవసరమో అంతవరకు దానితో ఉండాలి, అతి పనికి రాదు.

భగవంతుడు హృదయంలో ఉన్నాడు. మనకు నేను అనే తలంపు ఉంది. అది హృదయంలో నుండే వస్తోంది. ఈ నేను అనే తలంపు పోతే మనం భగవంతుడిలోనే ఐక్యమైపోతాము ఎందుచేతనంటే అది అక్కడ నుండే వస్తోంది. మన ద్వారా మంచి జరిగినా, చెడ్డ జరిగినా నడిపించేవాడు భగవంతుడే అంటే చెడ్డపనులు భగవంతుడు చేస్తున్నాడు అని కాదు, నీలో చెడ్డగుణాలు ఉంటే వాటి ద్వారా పని చేయించేవాడు ఆయనే. వాడు మంచి చేసాడు, వీడు చెడ్డ చేసాడు అని అనుకొన్నా వెనకాల ఉన్నవాడు ఎవరు? దేవుడే ఉన్నాడు. అయితే నీ గుణాలను బట్టి నీచేత పని చేయిస్తున్నాడు అంతే. నాలో మంచితనం అసలు లేదు అనుకోండి, అది కవర్ చేసుకోవటానికి అందరినీ విమర్శిస్తూ ఉంటాను. వాడి గురించి చెప్పకోవటానికి ఏమీ లేదు అందుచేత. వాడు చెడ్డవాడు, వీడు చెడ్డవాడు అని అలా చెప్పగా చెప్పగా వీడిని మంచివాడు అనుకొంటారని అలా చేస్తాడు, అసలు ఉద్దేశం అది. వాడు కూడా చెప్పాలని చెప్పడు వాడిలో ఉన్న చెడ్డ ఇది అంతా చేయిస్తుంది. చెడ్డవారితో భగవంతుడు మిమ్మల్ని తిట్టిస్తాడు, భగవంతుడు ఎందుకు అలా చేస్తున్నాడు అంటే మీలో సహనం ఎంతవరకు ఉందో తెలుసుకోవటానికే అలా చేస్తున్నాడు. మంచివారితో తిట్టించాలన్నా వారు తిట్టరు అందుచేత చెడ్డవారిని ఉపయోగించుకొంటాడు. మీ మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వటం కోసం, మీ మనస్సును బాగుచేయటంకోసం చెడ్డవారిని ఉపయోగించు కొంటాడు. చెడ్డవారికి ఏమీ పనిలేదు అనుకోవద్దు. ప్రపంచంలో చెడ్డవారు కూడా అవసరం. మంచివారిని ఇంకా మంచివారుగా చేయటానికి, మనిషిని మహాత్ముడిగా చేయటానికి చెడ్డవారి పాత్ర అవసరం ఉంది కాబట్టే అక్కడ చెడ్డవారు ఉన్నారు. కైకేయి లేకపోతే రామాయణం లేదు. కైక లేకపోతే రాముడు అరణ్యానికి రాడు. రాముడు అరణ్యానికి రాకపోతే రాక్షసులను ఎవడు సంహరిస్తాడు.

మీరు నిరంతరం లోకాన్ని చింతిచటం వలన మరల దేహం వచ్చేస్తుంది ఎందుచేతనంటే లోకంలో ఉన్న భోగాలు అనుభవించటానికి దేహం అవసరం, ఇంక వాడు ఈ చక్రంలో నుండి బయటకు రాలేడు. ఇలా లోకాన్ని చింతించేబదులు నిరంతరం బ్రహ్మాన్ని చింతిస్తాడు అనుకోండి బ్రహ్మం అయిపోతాడు. అప్పడు ఇంక నీకు లోకంతోటి, దేహంతోటి పనిలేదు. భగవంతుడు మనకు దేహాన్ని ఇవ్వాలని ఇవ్వడు. మనకు కోరికలు ఉన్నాయి అనుకోండి, ఆ కోరికలు నెరవేరాలంటే దేహం అవసరం కాబట్టి మనకు దేహాన్ని ఇస్తాడు. మనకు ఏ కోరిక లేదు అనుకోండి ఇంక దేహంతో మనకు పని లేదు. మీరు సుఖాన్ని

కోరుకోవటంలో తప్పలేదు కాని అది ఎక్కడ లేదో అక్కడ సుఖం కోసం వెతుక్కొంటున్నాము. సుఖం అనేది ఎక్కడ ఉందో నీకు తెలియజేసి అక్కడకు మీ మనస్సును తిప్పేవాడే గురువుకాని మీ మెప్పులకోసం మీకు ఇష్టమైన మాటలు చెప్పేవాడు గురువుకాదు, వాడు రాక్షసుడు. మీ అహంకారాన్ని పెంచే మాటలు చెపుతూ ఉంటే అది ప్రేయస్సు. మీకు మేలు కలుగజేసే మాటలు, మీ మనస్సును పవిత్రం చేసే మాటలు చెపుతూ ఉంటే అది శ్రేయస్సు. గురువు అనేవాడు మీకు శ్రేయస్సు మాటలే చెప్పాలి. విషయచింతన విషంకంటే ప్రమాదం అని ఆచార్యులవారు చెప్పారు. ఎందుచేతనంటే విషాన్ని మీరు చింతన చేయటం వలన చావరు, అది తాగితే చనిపోతారు. విషయచింతన అలా కాదు. విషయాలను చింతిస్తూ ఉంటే అది అనేక నీచజన్మలకు కారణం అవుతుంది.

నీ మనస్సులో ఉన్న అన్ని కోరికలను, సంకల్పాలను విడిచిపెట్టు. ఏ రకమైన కోరిక ఉన్నా బంధమే. కోరిక లేకపోతే పని అవ్వదేమో అని మనం అనుకొంటాము. మీ ప్రారబ్దంలో ఉంది అనుకోండి, మీ కోరికతో సంబంధం లేకుండా ఆ పని అయిపోతుంది. అది ఈశ్వరుడి ప్రణాళికలో లేదు అనుకోండి మనం ఎంత ప్రయత్నం చేసినా ఆ పని అవ్వదు. రమణమహర్షి గారు బ్రహ్మం గురించి శ్రవణం చేయలేదు, దాని గురించి ఆయన ఏమీ చదవలేదు, అంటే దాని గురించి ఏమీ తెలియకుండానే బ్రహ్మానుభవం పొందారు, అంటే ఆయనకు ఆయోగం ఉంది. నీకు అర్హత ఉంటే, ఆ యోగ్యత ఉంటే దానంతట అదే వచ్చేస్తుంది. మనకు ఎంతవరకు అర్హత ఉందో, ఎంత వరకు యోగ్యత ఉందో అంతే వస్తుంది కాని అంతకంటే ఎక్కువ రాదు. నేను యుద్ధం చేయను అని అర్జునుడు చెపుతాడు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే అది నీ కోరిక మీద ఆధారపడి లేదు. నీ ప్రారబ్దంలో యుద్ధం చేయటం ఉంది, ఒకవేళ యుద్ధం చేయటం నీకు ఇష్టం లేకపోయినా నీ స్వభావం బలవంతాన నీచేత యుద్ధం చేయిస్తుంది అని చెప్పాడు. ఒకేసారి అన్ని కోరికలను విడిచిపెట్టలేవు అందుచేత నెమ్మదిగా వాటిని తగ్గించుకొంటూరా, కోరికలు మినిమమ్ చేసుకో. మనకు దేహాత్మబుద్ధి ఉంది కాబట్టి జిన్నూరుకు మనకు సంబంధం ఉంది. దేహం మీరు అయితే జిన్నూరుకు మీకు సంబంధం ఉంది కాని దేహం మీరు కానప్పుడు ఇంక సంబంధం ఏమిటి? పుట్టినవాడు చనిపోతాడు కాని పుట్టనివాడు ఎలా చనిపోతాడు. నువ్వు పుట్టనివాడివే. ఆ పుట్టనివాడు ఎవడో తెలుసుకొనేవరకు ఎన్ని జన్మలు ఎత్తినా నువ్వు ఈ బంధంలో నుండి బయటకు రాలేవు. ఇవన్నీ భగవంతుడు మనకు చెపుతూ ఉంటే, అంతా అబద్ధం అని మనకు అనిపిస్తుంది

ఎందుచేతనంటే దానికి సంబంధించిన అనుభవం మనకు లేదు. భగవంతుడు చెపుతున్నాడు, ఈ విషయాలు మనకు అర్ధమవ్వటం లేదు అని మనం అనుకోము, ఇవన్నీ అబద్దాలు అనుకొంటాము. భగవంతుడు చెప్పిన విషయాలు అబద్దం అనుకొంటే ఆయనకు నష్టం ఏమిటి? మనమే నష్టపోతాము. మన తలకాయలో ఉన్నదే నిజం అనుకొంటాము కాని ఆయన చెప్పింది నిజం అనుకోము. మన తలకాయలో ఉన్న గొడవ అంతా మూటకట్టి ఒక ప్రక్కనపెడితే అప్పుడు ఆయన చెప్పింది మనకు అర్ధమవుతుంది. కృష్ణుడు దుర్మార్గుడు అనుకొంటే ఇంక ఆయన చెప్పేది మనకు ఎలా అర్ధమవుతుంది, ఎంతోకొంత భగవంతుడు మీద గౌరవం ఉండాలి కదా.

గురువు యొక్క దయలేకుండా మీకు ఎంత చదివినా అది మీకు అర్ధమవ్వదు, ఒక్క శబ్దం కూడా మీ గుండెను తాకదు. ఆయన అనుగ్రహం లేకుండా ఉన్నది ఉన్నట్లుగా గ్రహించే శక్తి మనకు రాదు. వివేకానందుడు బుద్ధుడు గురించి చాలా గొప్పగా చెప్పేవాడు. మన మహారాజులు, దేవుళ్ళకంటే ఆయన గొప్పవాడు అని వివేకానందుడి ఉద్దేశ్యం. బుద్ధుడికి ఇల్లు విడిచిపెట్టి వచ్చాక ఆయనకు ఎప్పుడూ ఇంటి గురించి చింత రాలేదు, రాజ్యం గురించి చింత రాలేదు. మనం ఇంటి దగ్గర పిడకలు ఎండబెట్టి పాలకొల్లు గుడికి వెళ్ళాము అనుకోండి, వర్షం వచ్చింది అనుకోండి, అప్పుడు మనం పాలకొల్లు గుడిలోనే ఉంటాము కాని ఇంటి దగ్గర పిడకలు తడిసిపోతాయేమో అనుకొంటాము అంటే మనం ప్రపంచానికి అంత దగ్గరగా ఉన్నాము. కొంపలు మిమ్మల్ని పట్టుకోలేదు, మీరే కొంపలను పట్టుకొని ఏడుస్తున్నారు అంటాడు స్వామీజీ. ఎవరిని అడిగినా మేము గృహస్థులం, మేము గృహస్థులం అంటున్నారు. గృహాలను మీరు పట్టుకొన్నారా, గృహాలు వచ్చి మిమ్మల్ని పట్టుకొన్నాయా అని అడిగాడు. ఇల్లు విడిచిపెట్టి ఇక్కడకు మీరు వచ్చారు కదా. ఇక్కడకు వెళ్ళవద్దని మీ ఇల్లు చెప్పిందా ఏమీ చెప్పలేదు. కాని ఆ ఇంటిమీద మీకు ఉన్న మోహం కొలదీ ఇక్కడకు వచ్చాక కూడా ఆ ఇంటినే తలపెట్టుకొంటున్నారు. మీరు ఇంటిని పట్టుకొని అది నన్నుపట్టుకొంది అనుకొంటున్నారు. అది మిమ్మల్ని పట్టుకోలేదు, మీరే ఇంటిని పట్టుకొన్నారు.

సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం మన హృదయంలో ఉంది. మీరు ఆ హృదయంలో కరిగిపోయినప్పుడు ఇంక ఆనందంకోసం బయట తిరిగే జీవుడు కనబడడు. ఒకసారి స్వరూపసుఖం మీకు అందిందా ఇంక దానితోటి ఎడబాటు రాదు. ఎప్పుడైనా చెడు ప్రారబ్దం ఉండి స్వరూపసుఖాన్ని నీవు మరిచిపోయినా మరల సడన్‌గా హృదయంలో

ఉన్న ఆత్మారాముడు గుర్తుకు వచ్చి అక్కడకు జారిపోతావు, అందులో లయమైపోతావు. హృదయంలో ఉన్న సుఖం ఎలా ఉంటుంది అంటే మీకు అర్థమవ్వటంకోసం చెపుతున్నాను. మీకు వెయ్యికోరికలు ఉన్నాయి అనుకోండి. వెయ్యికోరికలు ఒకేసారి నెరవేరిపోయినాయి అనుకోండి, అప్పుడు మీకు ఎంత ఆనందం వస్తుందో దానికి వెయ్యిరెట్లు ఉంటుంది లోపల ఉన్న ఆనందం, అది ఇట్టిది అని ఎవరూ చెప్పలేము, ఇంక దానిలోనుండి మీరు ఎలా బయటకు వస్తారు. నువ్వు ఊహించుకోవటం మానెయ్యి. ఊహించుకోవటం వలననే నీకు భయం వస్తుంది, ఇష్టం వస్తుంది, అయిష్టం వస్తుంది, అన్ని వికారాలు వస్తాయి. నువ్వు రవ్వంత, ముల్లంత నీ మనస్సును హృదయం వైపుకు తిప్పితే అదే లాగేస్తుంది. ఎవరు లాగుతున్నారు అంటే అది ఆయన దయే. హృదయంలో ఉన్నవాడు దయాస్వరూపుడు, ఆయన మహాగురువు. ఆయన మీ కళ్ళకు కనిపించకపోయిన, మీ బుద్ధికి అందకపోయినా అక్కడ ఉన్నవాడే పురుషోత్తముడు, ఆయనే ఆనంద స్వరూపుడు. నువ్వు సుఖాన్ని కోరుకోవటంలో తప్పలేదు, కాని సుఖాన్ని బయట నుండి పొందుదామనుకొంటున్నావు, అది తప్పు. బయట ఉన్న సుఖం ఎట్టిది అంటే దుఃఖం అనే కిరీటం పెట్టుకొన్న సుఖం. బయట నుండి వచ్చేది సుఖం అని నీవు అనుకోవచ్చుకాని చివరకు అది అంతా దుఃఖంగా మారిపోతుంది. నీ లోపల ఉన్న సుఖమే నిజమైన సుఖం, ఆ సుఖస్థానంలో నిలబడ్డావు అనుకో నీలోపల దుఃఖం ఉన్నా అది అంతా ఆనందంగా మారిపోతుంది.

ఈ ఒక్కమాటను జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఆత్మ చెప్పింది అహంకారానికి అర్థమవుతుందా? కృష్ణుడు అంటే ఎవడు ఆత్మ. మనకు ఉన్నది ఏమిటి అహంకారం. ఆయన చెప్పింది మనకు ఎలా అర్థమవుతుంది. అర్థమవ్వటం లేదు అని ఊరుకోకూడదు, తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అలా మనం ప్రయత్నం చేయగా, చేయగా మీరు ఎంత మొద్దబ్బాయిలు అయినా మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆత్మానుగ్రహం వస్తుంది. ఆత్మానుగ్రహం వలన ఆత్మ చెప్పింది మనకు తెలుస్తుంది, అదీ లాజిక్కు. సహజంగా ఉన్న ఆనందం. మీ చేతికి అందినప్పుడు ఇంక కృత్రిమంగా వచ్చే ఆనందాల కోసం నువ్వు బయట తిరగవు. పంచదార డబ్బాలో ఉన్న చీమను నువ్వు బయటకు వచ్చేయి అని అడిగినా అది రాదు అలాగే జీవుడికి సహజమైన సుఖం, ఆనందం అందినప్పుడు ఇంక బయట సుఖాల మీదకు మనస్సు వెళ్ళదు. సహజమైన సుఖం దొరికేవరకు సహజంకాని సుఖాల మీదకు నీ మనస్సు వెళ్ళిపోతూ ఉంటుంది, నువ్వు ఆపు చెయ్యాలన్నా అది ఆగదు. హృదయంలో ఉన్న

సహజమైన సుఖం దానికి దొరికితే నేచురల్‌గా నీ మనస్సుకు నిగ్రహం వచ్చేస్తుంది, అది అణిగిపోతుంది. ఎంత చీకటిగా ఉన్నా ఏదో టైముకు వెలుతురు వస్తుంది అలాగే మీకు ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ మీరు సాధన విడిచిపెట్టకుండా ఉంటే, భగవంతుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఏదో రోజున మహావెలుతురును మీరు చూస్తారు అయితే మధ్యలో విడిచిపెట్టకూడదు. ఒకమంచిపని చేసేటప్పుడు అవసరమైతే చావు వచ్చినా దానికి స్వాగతం చెప్పండి అంటే చావు కావాలని తెచ్చిపెట్టుకోమని కాదు. ఎటువంటి కష్టాలు ఎదురైనా భయపడవద్దు, సాధన విడిచిపెట్టవద్దు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఈ సృష్టి అంతా వాసుదేవ స్వరూపమే, దానికి భిన్నంగా ఏమీ లేదు. అది మీరు నోటితో చెప్పటంకాదు, అది మీకు అనుభవంలోనికి వస్తే అదే మీకడసారి జన్మ అని చెప్పాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ౦౨-౦౪-౨౦౦౨, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది కలియుగం. ఈ కలియగంలో మీరు పెద్దపెద్ద యజ్ఞాలు, యాగాలు చేయనక్కరలేదు. రామనామం, కృష్ణనామం, శివనామం ఇలా ఏదో భగవంతుడు యొక్క నామం హృదయపూర్వకంగా చేసుకొంటే మీరు తరిస్తారు. పూర్వపు యుగాలలో యజ్ఞాలు, యాగాలు చేసిన వారికి ఎటువంటి ఫలితం వస్తుందో కలియుగంలో నామస్మరణ వలన అటువంటి ఫలితం వస్తుంది. ఇప్పుడు మనవారు కాలేజీలు, హాస్పటల్స్ కట్టించటానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు, గుడులు కట్టాలి అంటే గుడులు ఎందుకు అంటున్నారు. ఇక్కడే మనం పాడైపోతున్నాము, ఆ విషయం మనకు తెలియటం లేదు. ఏదైనా రోగం వస్తే హాస్పటల్‌కు వెళితే ఆ రోగం తగ్గుతుంది, కాలేజీలో చదువులు చెపుతారు, ఈ కాలేజీలవలన, హాస్పటల్స్‌వలన మనిషిలో ఉన్న చెడుఅలవాట్లుపోవు, అవి అలాగే ఉంటాయి. కొంతమంది చాలా బాగా చదువుతారు, వారు అందరూ బుద్ధిమంతులు అని చెప్పలేము. నూటికి నూరు మార్కులు వచ్చేటప్పటికి ఇతరులకంటే మనలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటారు, గర్వం వచ్చేస్తుంది, అసలు మనిషి పాడైపోవటానికి అదే కారణం. అందరూ అలా ఉంటారు అని చెప్పలేము. మన శరీరం యొక్క రంగులు తేడా, మన మనస్సులు తేడా కాని మనం అందరం ఒక్కటే. మీరు వేరు, నేను వేరు అనే తలంపు మనకు ఉంది, ఆ వేరుబుద్ధి వలన మనం పాడైపోతున్నాము. మీరు వేరు, నేను వేరు అనే తలంపు మనకు నిద్రలో లేదు.

ఎప్పడు వస్తోంది అంటే జాగ్రదవస్థలో మనస్సు వచ్చాక వస్తోంది. మనస్సు వస్తే తలంపులు వస్తున్నాయి, ఆ తలంపులు మనలను విడగొట్టేస్తున్నాయి, ఆ వేరుబుద్ధి వలన చెడిపోతున్నాము.

అమెరికాలో చర్చిలు ఎక్కువగా ఉంటాయి. పాడైపోయినవారిని చర్చిలలో చేరదీసి వారికి షెల్టరు ఇచ్చి, ఆహారం పెడతారు. చర్చి ఆవరణలో రోజూ బైబిలు చెపుతారు, అది అందరూ వింటారు. అలా వినటం వలన జరిగిపోయింది ఏదో జరిగిపోయింది, ఇప్పడు బాగుపడటానికి ప్రయత్నం చేద్దాము అనుకొంటారు, అలా చాలా మంది బాగుపడతారు. మనకు వారికి తేడా ఏమిటి అంటే మనం పాడైపోయిన వారిని వదిలేస్తాము, అన్నివిధాలుగా బాగున్నవారిని ఎక్కువ గౌరవిస్తాము, మన బుద్ధి మంచిదికాదు. తప్పిపోయిన గొర్రెలంటే నాకు ఇష్టం అంటాడు ఏసు. అంటే పాడైపోయిన వారు అంటేనే ఇష్టపడతాను వారిని బాగుచేయుటంకోసం. కొంతమందికి ఏమీ లేకపోయినా గర్వంగా ఉంటారు అంటే ఆ గర్వం ఎందుకు వస్తోంది అంటే ఏదో తెలియనితనం వలన వస్తోంది అంతకంటే ఏమీలేదు. మన ఇండియాలో దేవాలయాలలో ఎక్కువగా పూజలు చేస్తూ ఉంటారు. దేవాలయాలలో భగవద్గీత, విష్ణుపురాణం, శివపురాణం ఇలా ఏదో ఒకటి పండితులచేత రోజూ చెప్పించాలి. అవి వినటంవలన సబ్జెక్టుమీద ప్రీతి కలుగుతుంది. మీరు ఇంటిదగ్గర కూర్చోవటం వలన ఏమీ తెలియదు. పెద్దలు సబ్జెక్టు చెపుతూ ఉంటే శ్రవణం చేయాలి. అలా శ్రవణం చేయక ముందు మేమే పండితులం అని మీరు అనుకొంటారు. శ్రవణం చేసిన తరువాత మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి, వాటిని తెలుసుకోవాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది. మీరు చదువుకొనే చదువులు అన్నీ పొట్టకు సంబంధించిన విద్యలు. కాలేజీ చదువుల వలన లైఫ్‌లో క్వాలిటీ పెరగదు, క్వాంటిటీ పెరగవచ్చు. పూర్వం మీకు పది ఎకరాలు ఉంటే, చదువుకొని అమెరికా వెళ్ళి ఉద్యోగం చేసి ఇంకో పది ఎకరాలు కొనుక్కొంటున్నారు అంటే క్వాంటిటీ పెరుగుతోంది కాని మీ మైండ్‌లో క్వాలిటీ పెరగదు. హాస్పటల్ నీ రోగం తగ్గిస్తుంది కాని నీ గుణాన్ని మార్చదు. గుడియొక్క విలువ మనకు తెలియటం లేదు. ఏవో గుడులు కట్టేయటంకాదు అక్కడ టీచింగ్ ఉండాలి, అంతలోతుకు వెళ్ళి మనం ఆలోచించలేక పోతున్నాము. ఒక ఆచార్యుడు చేసేపని, సద్గురువు చేసే పని స్కూలు, హాస్పటల్ చేయలేవు. ఆచార్యుడు చేసేపని డాక్టరు ఎక్కడ చేస్తాడు.

భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. మనం సాధనచేసి భగవదనుభవం పొందాలి. ఇప్పడు భక్తులలో కూడా చాలామంది ఎలాగ ఉన్నారు అంటే మేమే దేవుళ్ళము,

మమ్మల్నే ఆరాధించండి అంటున్నారు, అందరూ హిరణ్యకశిపుడిలాగ తయారవుతున్నారు. మనం చదివే చదువులు అన్నీ మనస్సుకు సంబంధించినవి. ఆత్మవిద్య అంటే మన గురించి మనం తెలుసుకోవటం. బయట విద్యలు నేర్చుకొంటే డబ్బు సంపాదించవచ్చు, ఆస్తులు సంపాదించవచ్చు కాని మనలో ఉన్న అజ్ఞానం ఎక్కడికీ పోదు. ఒక్క ఆత్మ జ్ఞానం వలననే మనలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. మనం సబ్జక్టు వినకపోతే మనలో అజ్ఞానం ఉందని కూడా మనకు తెలియదు. మీకు స్వరూపజ్ఞానం కలిగినప్పడు ఈ ప్రపంచంలో ఉన్న సంపద అంతా ఇవ్వలేని శాంతిని, ఆనందాన్ని అది మీకు ఇస్తుంది. ఆత్మజ్ఞానం పొందినవాడికి మనం అనుభవించే భోగాలు, ఇంద్రియసుఖాలు అన్నీ గడ్డిపరకలాగ కనబడతాయి. ఏదో కాలేజీలో చదివివారు ఆస్థితిని పొందలేదు. వారు తపస్సుచేసి, దేహాన్ని మనస్సును శిక్షించుకొని, మనోదేహములను నియమించుకొని, విపరీతమైన పట్టుదలతో ప్రయత్నంచేసి, హద్దులులేని క్రమశిక్షణను అవలంభించి వారు ఆ స్థితిని పొందారు. ఆధ్యాత్మిక గ్రంధాలు ఏమీ చదవకుండా ఆధ్యాత్మిక రంగంలో అభివృద్ధిలోనికి వచ్చినవారు ఉన్నారు, పరమేశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం వలన వారు ఆ స్థితిని పొందారు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళేటప్పడు గుహుడు నదిని దాటిస్తాడు. అప్పడు ఇవ్వటానికి రాముడి దగ్గర డబ్బులు లేవు. డబ్బులు లేకపోయినా దాటిస్తాను నువ్వు చేసేపని నేను చేసేపని ఒక్కటే అంటాడు గుహుడు. నేను జీవులను నది ఒక ప్రక్కన నుండి రెండో ప్రక్కకు దాటిస్తున్నాను. నువ్వు జీవులను అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి దాటిస్తున్నావు అంటాడు గుహుడు.

భక్తిని పెంచుకోవాలి, ఆత్మజ్ఞానం సంపాదించాలి అని అంటే సరిపోదు. ఒకప్రక్క ఆత్మజ్ఞానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చేస్తూ రెండో ప్రక్క గుణసంపదను పెంచుకొంటూ రావాలి. గుణసంపదను పెంచుకోము అనుకోండి భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసినా అది ఫలించదు. మనం మహాత్ములను, మహర్షులను విమర్శించకూడదు. ఒకో సందర్భంలో వారు ఆ పనులు ఎందుకు చేసారో మనకు తెలియదు. మనది చాలా చిన్న మనస్సు, ఈ మనస్సుతో మనం వారిని అర్ధం చేసుకోలేము. మనం చాలా జాగ్రత్తగా మాట్లాడాలి, వినయం విడిచిపెట్టకూడదు. నిజంకానిదానిని చూసి నిజమని నువ్వు ఉద్రేకపడకు. ప్రపంచం నిజంకాకపోయినా అది నిజం అని నువ్వు అనుకోవటం వలన దుఃఖానికి గురిఅవుతున్నావు. యూనివర్సిటీలలో పనిచేసే ప్రొఫెసర్లు, పెద్దపెద్ద డాక్టర్లు మీ దుఃఖాన్ని ఆర్పలేరు, అది ఒక్క జ్ఞానికి మాత్రమే సాధ్యం. మనం సాధన ఎలా చెయ్యాలి

అంటే ఇప్పుడు డాక్టరుగారు వచ్చి మీరు ఇంకోగంటకంటే ఎక్కువ బతకరు, గుండె అంతా పాడైపోయింది అని చెపితే మీరు సినిమాలకు, షికార్లకు వెళ్లరు, ఇంట్లో ముఖ్యమైన పనుల గురించి ఆలోచిస్తారు, ఎవరికి ఏమిచెప్పాలి అని చూసుకొంటారు. ఒక గంటలో ప్రాణం పోతుంది అంటే మీరు ముఖ్యమైన పనులు ఎలా చూసుకొంటారో అలాగే ఆత్మజ్ఞానం పొందటమే ముఖ్యమైన పని అంతకంటే ముఖ్యమైనది ఏదీ లేదు ఈ జీవితంలో అని మీరు సాధన చేస్తూ ఉంటే మీరు ఒడ్డుకు వస్తారు, అంటే మీ సాధన అలా ఉండాలి, బ్రాహ్మీస్థితి పొందటానికి అంత శ్రద్ధగా సాధన చెయ్యాలి. కబీరుదాసుకు ఏమీ చదువులేదు. రామనామం చేసి, ఇతరులకు రామనామం బోధించి గొప్ప మహాత్ముడు అయ్యాడు. ముక్తి ఎందుకండి మాకు భక్తిచాలు అని కొంతమంది అంటారు, అటువంటి వాడు కబీరుదాసు.

రామకృష్ణుడి దగ్గర కూర్చొని భక్తికి సంబంధించిన మాటలు మాట్లాడుకొంటూ ఉంటే ఆయన సమాధిలోనికి వెళ్లిపోయేవారు. వందల సంవత్సరాలు తపస్సు చేసి సంపాదించలేని స్థితిని దైవనామం వినేటప్పటికి ఆయనకు సమాధిస్థితి వచ్చేసేది. చైతన్యం యొక్క వైభవం మనకు తెలియాలంటే సమాధిస్థితిని పొందాలి. గంటలతరబడి ఆయన సమాధిస్థితిలో ఉండేవాడు. సమాధి స్థితిలో అక్కడ ద్వితీయం ఉండదు. సమాధిస్థితిని పొందినవాడు ప్రకృతిని దాటి ఉంటాడు. దేవుడు వేరు, నేను వేరు అనే ద్వైతం అక్కడ ఉండదు, అది అద్వైతానుభవం. మీరు ఎవరితో అయినా స్నేహం చేసేటప్పుడు ఎంతవరకు చేయాలో అంతవరకే స్నేహం చేయాలి, ఎంతవరకు అవసరమో అంతవరకే మాట్లాడాలి కాని వారితో అంటుకొనిపోవద్దు, అంటుకుపోతే మోహంలో పడిపోతారు, పతనం అయిపోతారు. మీకు ఎక్కడైనా పనులు ఉంటే వెళ్లి చూసుకొని రండి అంతేగాని వాటితో కలిసిపోవద్దు, మీరు మీరుగా ఉండండి. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఆ ఆకర్షణల మధ్యన మనం ఆకర్షణ లేకుండా ఉండగలిగితే వాడు భక్తుడు. సుగ్రీవుడు తాగేసి రాముడి పని మర్చిపోతాడు. లక్ష్మణుడు వచ్చి ఏమన్నాడు అంటే నీ పని రాముడు చేసి పెట్టాడు. రాముడికి నువ్వు వాగ్దానం చేసావు, స్నేహధర్మం వదిలేసావు, తాగేసి కొట్టుకొంటున్నావు. వాలిని ఎక్కడికి పంపాడో నిన్ను కూడా అక్కడికి పంపిస్తాను అంటాడు, అంటే నిన్ను కూడా చంపేస్తాను అనటం. అప్పుడు వాలి భార్య తార ఏమంది అంటే ఎవరిని చంపేస్తావు, ఇప్పటివరకు అన్నగారికి జడిసి సుగ్రీవుడు కొండలమీద తిరిగాడు, వాడికి భోగవాంఛ ఉంది, భోగవాంఛ నెరవేర్చుకోవటానికి అవకాశం లేదు, ఇప్పుడు అవకాశం వచ్చింది. ఆ

మత్తులోపడి ఉన్నాడు. రాముడి పని మర్చిపోయిన మాట నిజమే, అది పొరపాటే. మీ మనుషులు కోతులు లాగ ప్రవర్తిస్తున్నారు, అది పొరపాటు, కోతులు కోతులులాగ ప్రవర్తిస్తే పొరపాటు ఏముంది అంటుంది, లక్ష్మణుడు తలవంచుకొని కూర్చొన్నాడు. వాలి భార్య, రావణాసురుడి భార్య ఇద్దరు పతివ్రతలు, చాలా తెలివైనవారు. భర్తలు చెడ్డవారు దొరికారు అదొక ప్రారబ్ధం. వారు సంసారపక్షంగా ఉన్నారుకాని వారి మనస్సులు ఎప్పుడూ భర్తలకు ఇవ్వలేదు. ఎందుచేతనంటే వారి భర్తలు దుర్మార్గులు అని వారికి తెలుసు. ఎప్పుడైనా మనలాంటి అమాయకులు వెళ్ళి వారి వలలో పడుతూ ఉంటే, మీ పనులు మీరు చూసుకోండి, వీళ్ళ దగ్గరకు చేరవద్దు అని చెప్పేవారు, నిజంగా ప్రజల క్షేమం కోరేవారు అంటే వారే. వాళ్ళు ఇద్దరు మంచివారు, జ్ఞానంతోకూడిన మంచివారు.

భగవంతుడు ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము కాని ఆయనకు శరణాగతి చేయలేకపోతున్నాము. మన అహంకారం శరణాగతి చేయనివ్వదు. డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో శరణాగతి చేస్తే మోక్షం రావటం అంత తేలిక. అహంకారం విషసర్పంలాంటిది. అది మన చేతికి లొంగదు. మనకు మంచితలంపులు వచ్చినా, చెడుతలంపులు వచ్చినా దేహము నేను అనే తలంపులో నుండే వస్తాయి, అదే అహంభావన. దేహము పుట్టినప్పుడు నేను పుట్టాను అంటుంది, దేహము చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అంటుంది, ఈ రెండూ అబద్దాలే. కాని ఆ అబద్దాలను నిజంలాగ చూపిస్తుంది, నిజాన్ని మనకు కనబడనీయదు, అదే అహంభావన. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు యొక్క దయలేకుండా దాని పట్టులో నుండి మనం బయటకు రాలేము. అందుచేత బయటవారు వచ్చి నీ అహంకారాన్ని తొలగిస్తారని ఎదురుచూడవద్దు. నెమ్మదిగా నువ్వు ప్రయత్నం చేసి, శాస్త్రాన్ని గుర్తుపెట్టుకొని, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి అహంకారాన్ని తొలగించుకోవాలిగాని ఎవరో వచ్చి దానిని తొలగించలేరు. అహంకారం లోపలనుండి విజృంభిస్తున్నప్పుడు పెద్దవారిని కూడా తిట్టేస్తాము, సోక్రటీసును విషంపెట్టి చంపారు, గాంధీగారిని కాల్చి చంపారు, క్రీస్తును శిలువ వేసారు అలాగ మహాత్ములు ఎందరో సమాజంలో బలైపోయారు. సోక్రటీసును ఎందుకు చంపారంటే సమాజం ఆయన మంచితనాన్ని భరించలేకపోయింది. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే ఒక లిటిల్ మైండ్, ఒక గ్రేట్ మైండ్‌ను అర్థం చేసుకోలేదు అని చెప్పారు. ఇక్కడ ఇద్దరు కూర్చొన్నారు అనుకోండి, ఇద్దరిలో

చైతన్యస్థాయి తేడా ఉంది అనుకోండి భౌతికంగా దగ్గరగా కూర్చొన్నా ఒకరికి ఒకరు అర్ధమవ్వరు, వారు చెప్పేది వీరికి తెలియదు, వీరు చెప్పేది వారికి తెలియదు.

రాముడు అరణ్యవాసానికి వెళ్ళినప్పుడు రధంతోలేవాడు అమ్మగారికి ఏమని చెప్పమంటారు అని రాముడిని అడిగితే ఇప్పుడు నేను అరణ్యానికి వచ్చేసాను, కొడుకు అడవికి వెళ్ళాడు అని ఆ భ్రాంతిమీద ఆవిడ మనస్సు వికలంగా ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు అందరూ ధర్మాన్ని ఆచరిస్తారు, మనస్సు చిరాకుగా ఉన్నప్పుడు ధర్మాన్ని వదిలేస్తారు. ఈ పరిస్థితులు అన్ని దురదృష్టకరమైనవి. జరిగిన సంఘటనలు అన్నీ ఆవిడ మనస్సుకు విరుద్దంగా జరిగినాయి. అయినప్పటికీ ధర్మాన్ని విడిచిపెట్టవద్దు, ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉండమని చెప్ప, ఎప్పటికైనా ధర్మమే ఆవిడని రక్షిస్తుంది అని చెప్పమని రాముడు చెప్పాడు. సుఖంగా ఉన్నప్పుడు అందరూ ధర్మాన్ని ఆచరిస్తారు, కష్టంలో ఉన్నప్పుడే ధర్మాన్ని విడిచి పెట్టకుండా ఉండాలి అదీ రాముడు చెప్పింది. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే తల్లితండ్రులను మర్యాదగా చూడమని చెప్పాడు, భగవంతుడిని తెలుసుకోవటానికి తల్లిదండ్రులు కనుక అడ్డువస్తే తల్లితండ్రులను కూడా వదిలేయమని చెప్పాడు, ప్రహ్లాదుడు అలా వదిలేసాడు. నన్ను తెలుసుకోవటానికి అవసరమైతే ధర్మాన్ని కూడా విడిచిపెట్టు అని కృష్ణుడు చెప్పాడు. మామూలుగా తల్లితండ్రుల మాటవినాలి, అది రైటేకాని ప్రహ్లాదుడు వినలేదు ఎందుచేతనంటే లోపల జీవుడు పాడైపోయేమాటలు వాళ్ళు చెపుతూ ఉంటే ఎలాగ అందుచేత ప్రహ్లాదుడు వదిలేసాడు. ఎవరితో స్నేహం చేయాలో, ఎవరితో స్నేహం చేయకూడదో తెలియకుండా మీరు స్నేహాలు చేస్తే అది వారి తప్ప కాదు, వివేకం లేకపోవటం మీది తప్ప అని చెప్పాడు. మా అబ్బాయి చాలా మంచివాడు, వాళ్ళు వచ్చి మా అబ్బాయిని చెడగొట్టేసారు అని కొంతమంది తల్లులు అంటూ ఉంటారు. వీళ్ళబ్బాయి నిజంగా మంచివాడు అయితే వాళ్ళతోటి ఎందుకు స్నేహం చేసాడు, తల్లిప్రేమ వలన అది కనబడదు. వీళ్ళబ్బాయికి కూడా లోపల ఆ గుణాలు ఉన్నాయి కాబట్టి అక్కడకు వెళ్ళి వారితో స్నేహం చేసాడు.

ఇప్పుడు మనం ప్రపంచంలో ఉన్నాము కాబట్టి ప్రపంచంతోటి ఏదో ఒక సంబంధం తప్పదు. ప్రపంచంతో సంబంధం తప్పదు అని ప్రపంచంతో ఐక్యమైపోయి, ప్రపంచంతో అతిగా ఉండి, పరమేశ్వరుడికి దూరమైపోవద్దు అది కృష్ణుడు చెప్పేది. ప్రపంచంతో అతిగా ఉంటే, అతిగా స్నేహాలు చేస్తూ ఉంటే మీ టైము వేస్టు అయిపోతుంది, మీకు తెలియకుండా

ఆరోజుకారోజు భగవంతుడికి దూరమైపోతారు. మనకు దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియ విషయాలతోటి ఉన్న అనుబంధం భగవంతుడితోటి లేదు. మీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. ఈ దేహాన్ని, మనస్సును, ఇంద్రియాలను లోపల ఉన్న భగవంతుడిని తెలుసు కోవటానికి ఉపయోగించుకోకపోతే అలా నువ్వు ఎంతకాలం బతికినా అది అంతా వేస్టు అని చెప్పారు. అందరూ మేము భక్తులం, మేము భక్తులం అంటారు, ఒక్కరూ ఆడంబరం విడిచిపెట్టరు, వారేదో గొప్పవారు అని మనకు చెపుతూ ఉంటారు, భాష కూడా సరళంగా ఇతరులకు అర్థమయ్యేలాగ ఉండదు, ఇంక వీరు భక్తులు ఏమిటి అన్నారు పరమాచార్యులు. ఎలా చెపితే మీకు అర్థమవుతుందో అలాగ చెప్పకుండా, సబ్జక్టు వదిలేసి ఏవో ఆడంబరం మాటలు, పొల్లుమాటలు చెపుతూ ఉంటే వాడు భక్తుడు కాదు. ఇతరుల గొడవ మనకు అనవసరం. భక్తుడి భాష ఆడంబరంగా ఉండకూడదు. వస్త్రధారణ కూడా సామాన్యంగా ఉండాలి. ఖరీదు అయిన బట్టలు వేసుకొంటారు అనుకోండి మీకు తెలియకుండా గర్వం వచ్చేస్తుంది, లోపల ఆడంబరం పెరిగిపోతుంది. మీరు ఉపయోగించే వస్తువులలో ఆడంబరం పనికిరాదు. మీరు బాహ్యవిషయాలలో ఆడంబరంగా ఉంటే లోపల కుళ్ళిపోతూ ఉంటారు, అంటే మీ స్వరూపానికి దూరమైపోతారు. నేను ఉన్నాను, మనం ఎలా ఉన్నాము అనుకొంటున్నాము. మనం మనస్సుగా ఉన్నాము అనుకొంటున్నాము లేకపోతే దేహంగా ఉన్నాము అనుకొంటున్నాము కాని నేను ఉన్నాను అనే స్థితి శరీరానికి గాని, మనస్సుకు గాని, చావు పుట్టుకలకుగాని సంబంధంలేనిది. అసలు ఉన్న వస్తువును ఉన్నట్లుగా ఎవడైతే సాక్షాత్కరించుకొన్నాడో అది వాడి కడసారి జన్మ, వాడికి ఇంక శరీరం రాదు ఎందుచేతనంటే అవసరంలేదు కాబట్టి.

ఈ ప్రపంచం దుఃఖాలయం అని కృష్ణుడు చెప్పాడు. ఈ ప్రపంచంలో ఉన్నది దుఃఖమే. ఈ ప్రపంచానికి సంబంధించి ఎక్కడ మీరు మోహపడినా అది దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఇక్కడ అందరూ పెద్ద మనుషులులాగ కూర్చొన్నాము. నా జీవితంలో అసలు అశాంతి అనుభవించటంలేదు అని చెప్పేవాడు ఎవడైనా ఉంటే చెప్పండి. మీకు దేహ అవసరాలు ఉంటాయి, అవి తీర్చుకోవచ్చు. మీ మనస్సు కల్పించిన గొడవలలో నుండి సగం సగం కాదు, పూర్తిగా బయటకు రండి అప్పుడు పరమాత్మ మీకు దర్శనమిస్తాడు. స్వామివారు ఏమనిచెపుతున్నారు అంటే మీ ఇంట్లో ఉన్న పేచీలకంటే, మీరు పడే ఆర్థిక ఇబ్బందులకంటే,

ప్రకృతి వలన వచ్చే బాధలకంటే మీ అజ్ఞానం పెట్టే బాధ చాలా ఎక్కువ. ఆ బాధలు అన్నీ కలుపుకొన్నా కూడా అజ్ఞానం పెట్టే బాధకంటే అవన్నీ తక్కువే, అది మీకు తెలిస్తే అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తారు. దాని వలన వచ్చే నష్టం నీకు అర్థంకానప్పుడు అందులో నుండి బయటకు రావటానికి నువ్వు సాధన చెయ్యవు. కృష్ణుడు చివరి రోజులలో ఉద్ధవుడితో ఏమనిచెపుతాడు అంటే ప్రతీమనిషి వాడి శరీరాన్ని వాడు బాగా చూసుకొంటాడు, నా శరీరం అంటే నాకు ఇష్టమే కాని నా శరీరం కంటే భక్తులు అంటే నాకు బాగా ఇష్టం అని పరమాత్మ చెప్పాడు. భారతయుద్ధంలో భీష్ముడు చేతిలో పాండవులు చనిపోయేలాగ ఉన్నారు, అప్పుడు కృష్ణుడు ఏమి చేసాడు అంటే నేను ఆయుధం పట్టను అన్నమాటను వదిలేసి చేతిలో ఆయుధాలు లేకపోతే బండిచక్రం పుచ్చుకొని భీష్ముడిమీదకు వెళతాడు. అప్పుడు అర్జునుడు ఏమన్నాడు అంటే నువ్వు ఆడినమాటను తప్పతున్నావు, లోకంలో నీకు అగౌరవం వస్తుంది అంటాడు. అంటే కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే మీరు నాకు భక్తులు, నన్ను నమ్మి ఉన్నారు, నాకు అగౌరవం వచ్చినా ఫరవాలేదు మీరు చనిపోకూడదు. మీరు చనిపోయిన తరువాత గౌరవం నేను ఏమి చేసుకొంటాను అన్నాడు. ఉద్ధవగీత రాగి కలపని బంగారం. పరమాత్మ చివరిరోజులలో కేవలం శుద్ధభక్తి గురించి ఉద్ధవుడికి బోధించాడు. కేవలం భక్తి గురించి తప్ప ఇంకోటి ఏమీ ఉండదు. నీకు తెలివి ఉండవచ్చు, నువ్వు పండితుడవు అయి ఉండవచ్చు, పరమాత్మ అయిన నా పట్ల నీకు భక్తిలేకపోతే మిగతా క్వాలిటీస్ నీకు ఎన్ని ఉన్నా నా స్వరూపం నీకు తెలియదు ఉద్ధవా అని చెప్పాడు.

మనకు భక్తి లేదు కాని భక్తుల కింద చలామణి అవుతున్నాము, దీని వలన ఏదో సాపాటు బాగానే దొరుకుతుంది కాని ముక్తి సున్నా. ఒకోసారి పరమాత్మ యొక్క అనుగ్రహం ప్రవాహం కింద వస్తుంది, ఇప్పుడు మనం చూస్తున్నదంతా డస్టు అని అప్పుడు మనకు తెలుస్తుంది. ఇదంతా మాయ అని ఒకోసారి మనకు స్ఫురణలోనికి తీసుకొని వస్తాడు కాని అక్కడ ఎందుకు ఉండలేము అంటే మరల వాసనలు వచ్చి మనలను కమ్మేస్తాయి. మధ్యలో మీకు స్వరూపానుభవం తెలుస్తున్నప్పటికీ వాసనాక్షయం అయ్యేవరకు అది నిలబడదు మీ మనో దేహములను దాటించి ఒకోసారి హృదయగుహలోనికి తీసుకొనిపోతూ ఉంటాడు పరమాత్మ. ఈ ప్రపంచంలో ఏమీ సారం లేదని అప్పుడు మీకు తెలుస్తుంది. మరల ఏదో ఒక వాసన ఆ గూటిలో నుండి మిమ్మల్ని బయటకు తీసుకొని వచ్చేస్తుంది, చివరకు ఒక్క


వాసన ఉన్నా మనకు పునర్జన్మ తప్పదు. మనం పూజ, జపం ఎందుకు చేస్తాము అంటే ఇవన్నీ మనో నిగ్రహానికి సహకరిస్తాయి. మనోనిగ్రహం లేకుండా, ఇంద్రియనిగ్రహం లేకుండా మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. మనస్సు ఎక్కువగా బాహ్యముఖానికి పోతోంది అనుకోండి వచ్చే జన్మలో ఘోరమైన ప్రమాదాలకు గురి అవుతాము. మనస్సుకు లోచూపు రావాలి, లోచూపు లేకపోతే ఆత్మజ్ఞానానికి అర్హతరాదు. మీరు దైవచింతన చేస్తూఉంటే విషయచింతన తగ్గిపోతుంది. దూడనుకట్రాడికి కట్టేస్తే అది ఎలా ఉంటుందో అలాగ మనస్సును తీసుకొని వెళ్ళి పరమాత్మ అనే కట్రాడికి కట్టేసి ఉంచితే విషయచింతన దూరమవుతుంది. మనం భగవంతుడి పాదాలను వదిలేసాము అనుకోండి వెంటనే లోకచింతన వచ్చేస్తుంది, అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది.

భగవంతుడు చెప్పిన వాక్యం మీద ముందు నీకు నమ్మకం కుదరాలి, నమ్మకం కుదరాలి అంటే నీకు పూర్వపుణ్యం ఉండాలి. పూర్వజన్మలలో ఏమీ సత్కర్మ చేయలేదు అనుకో శాస్త్రాన్ని నువ్వు ఎన్నిసార్లు చదివినా అది నిజంలాగ నీకు కనిపిస్తుంది కాని అది నువ్వు నమ్మవు అంటే పూర్వజన్మలో చేసిన చెడుకర్మ నిన్ను నమ్మనివ్వదు. నిన్ను నీవు తెలుసుకోకుండా ఏ లోకాలకు వెళ్ళినా శరీరానికి చెమట మిగులుతుంది కాని జ్ఞానం రాదు. ఏవో మంచిపనులు చేసి, పుణ్యం సంపాదించి ఏవో లోకాలకు వెళ్ళినా తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే. మీరు ఉన్నారని మీకు తెలుస్తోంది కదా, ఆ ఉన్నది ఏదో మీకు అనుభవంలోనికి రావాలి. మీకు రోగం వచ్చింది అనుకోండి, జ్వరంతో 20 లంకణాలు చేసారు అనుకోండి, ఇంక వాడికి కామం ఏమిటి? అప్పుడు మీరు కామాన్ని జయించేసాము, కోపాన్ని జయించేసాము అంటే అవన్నీ వట్టిమాటలు, మిమ్మల్ని మీరు మోసం చేసుకోవటం. మరల అన్నం తినేటప్పటికి అన్నీ విజృంభిస్తాయి. ఇంద్రియ విషయాలమీద మీ మనస్సులో ఉన్న రుచి పోవాలి. స్మశానవైరాగ్యం ఉన్న వాడికి జ్ఞానం ఏమిటి? వివేకంలో నుండి వైరాగ్యం రావాలి. విషయాల మీద నీ మనస్సుకు రుచి పోకపోతే అది ఆత్మకారం చెందదు. ఇంద్రియాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇంద్రియాల విషయంలో జాగ్రత్తగా లేకపోతే, సాధన విషయంలో జాగ్రత్తగా లేకపోతే నీకు తెలివితేటలు ఉన్నా నీ తెలివితేటలను ఇంద్రియాలు లాక్కొనిపోతాయి. శరీరంలో వచ్చే రోగాల కంటే, ప్రకృతి తీసుకొని వచ్చే కష్టాలకంటే, కుటుంబంలో వచ్చే బాధలకంటే మీ అజ్ఞానమే మీకు ఎక్కువ క్షోభను తీసుకొని వస్తోంది. అందుచేత ప్రయత్నం చేసి, ఇష్టంగా సాధన చేసి ఆబంధంలో నుండి బయటకు రావాలి.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| జూన్ | 25 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| జూన్ | 30 | కైకలూరు |
| జూలై | 7 | హైదరాబాద్, సత్యసాయి నిగమ, గురుపౌర్ణమి |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



ఖత్తర్‌లో సద్గురు శ్రీ నాన్నగారు

# ప్రేమించేవాడే - పాలించగలడు

మనం ఎప్పుడూ మంచిమార్గంలో నడవాలి. మన హృదయమే ప్రేమకు కేంద్రం. ఆ ప్రేమ ఎప్పుడూ తప్పు దారిలో నడవనియ్యదు. సెయింట్ ఆగస్టిన్‌తో ఒకరు "అయ్యా! సత్యానుభవానికి నేను ఏమి చెయ్యాలో ఒక్క మాటలో సూటిగా చెప్పండి. నేను చదువుకొన్న వాణ్ణికాను, వేదాంతాన్ని అర్థం చేసుకోలేను. మతాల సారమంతా ఇట్టే అర్థమయ్యేలాగా గుర్తుండేలా చిన్న మాటలో చెప్పండి" అనగా ఆయన "ప్రేమించు అది ఒక్కటే చాలు అన్ని దాన్ని అనుసరించేవస్తాయి. ప్రేమ తప్ప మరి దేన్ని నువ్వు పట్టించుకోకు" అన్నారు. మనలో ఎంతెంత ప్రేమ పెరిగితే అంతంతగా నిజాన్ని సమీపిస్తాము. ప్రేమ అంటే భగవంతుడికి భక్తుడికి ఉన్న అనుబంధం. ప్రకృతి వస్తువులను వస్తు దృష్టితో ప్రేమిస్తే బానిసలు అవుతాము. ప్రేమను మనం నేర్చుకోవాలి అప్పడే మనం ఎదగగలము. అహంకారాన్ని విసిరికొడితే తప్ప మనం ప్రేమలో ఉండలేము. ప్రేమను ఎలా నేర్చుకోవాలో గురువులు చెపుతారు. శ్రీనాన్నగారు "ఎదుటి మనిషిలో ప్రేమ లేదని మనం ప్రేమించటం మానకూడదు. ప్రేమ మన నుంచే ప్రారంభించాలి" అన్నారు. కన్నీళ్ళు దుఃఖంలోనేకాదు ఆనందంలో కూడా వస్తాయి. ఆనందంలో నుంచి వచ్చే కన్నీళ్ళు తియ్యగా ఉంటాయి. దుఃఖంలోంచి వచ్చిన కన్నీళ్ళు ఉప్పగా ఉంటాయి. ఆనందంతో వచ్చే కన్నీళ్ళ ద్వారా ఎలా ప్రార్థన చెయ్యాలో మనం చూడగలగాలి. అవి సత్యాన్ని తెలుసుకోవటానికి సామర్థ్యం కలిగి ఉంటాయి. అవే జీవిత సౌందర్యాన్ని, ఆశీర్వాదాన్ని దర్శించగలిగే సామర్థ్యం కలిగి ఉంటాయి. మనుషుల మధ్య ఏర్పడే ఘర్షణలను, కక్షలను, కార్పణ్యాలను తొలగించే శక్తి ప్రేమకు ఉంటుంది. ఆత్మానుభవంలో గర్వం పరాభవం పొందుతుంది, స్వార్థం నిరర్థకమౌతుంది. మోహం మధ్యలోనే తుంచివేయబడుతుంది. దుఃఖం, శోకం ఒక మూల పడవేయబడి ఉంటుంది. ద్వేషం సరిహద్దుల్లో నిలవదు. అది ప్రేమ యొక్క వైభవం. ప్రేమ గురువు తనకన్న భిన్నంగా దేనినీ చూడడు. ప్రకృతి గుణాలు ఎక్కడ ఉంటాయి. జ్ఞానం వల్ల వివేకవైరాగ్యాలు ప్రభలంగా పాదుకొంటాయి. ప్రేమ స్వరూపుణ్ణి అందరూ ప్రేమిస్తారు. ప్రేమ ఇస్తుంది అడగదు. ప్రేమ దోషాలను ఎంచదు. ప్రేమే పరిపాలన చేస్తుంది. మోసేను ప్రవక్త ప్రధాన ధర్మసూత్రం "నీకు ప్రేమ కన్న ఇతర దైవం ఉండకూడదు" అని భగవంతుడు ప్రేమ స్వరూపుడు అనటంకన్న ప్రేమే భగవంతుడు అనటం ధర్మం. ఆ ప్రేమే మనలో నెలకొల్పటానికే ఈ ప్రపంచం పరిభ్రమిస్తున్నది ప్రేమ శాశ్వతం అది మనమై ఉన్నాము. ప్రేమ స్వరూపుడైన గురువును ప్రేమిస్తే ఆ ప్రేమ మనలో మేల్కొని ఆ ప్రేమ అనుభవాన్ని పొందుతాము. అప్పడే మనం పరిపాలకులు కాగలము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం